# వృత్తి సంఘసేవ

కె. రామలక్ష్మి



"రుక్మిణీ! ఎంత సేపే? త్వరగా రా, టైమ్ అయిపోతోంది!" బెడ్‌రూమ్‌లో అద్దం ముందు కూర్చుని గాజులూ, గొలుసులూ తీసి పెట్టెలో పెడుతోంది. 'సంఘ సేవికురాలు ఇవన్నీ వేసుకుని వెడితే బాగుండదు' అనుకుంది మనసులోనే. చక్కటి స్టైల్లో ఉన్న హెయిర్ పీస్ తీసిపెట్టేసి, ఉన్న జుట్టుని సాపుగా దువ్వి సింపుల్‌గా జారుముడి వేసుకుంది.

కళ్యాణి! పేరుకు తగ్గట్టు బొద్దుగా, ముద్దుగా వెన్నతిన్న పిల్లిలాగా అనిపిస్తుంది. మెళ్లో గంటలేని పిల్లిలాగా అనిపిస్తుంది. చుట్టుపక్కల చిన్నా చితకా ఎలుకల్లాంటి సంఘసేవకులు అందుకే కనబడరు.

కళ్యాణి! ఈ సంవత్సరపు 'ఉత్తమ సంఘసేవిక'- బిరుదూ, బహుమతీ, ఘనత దక్కించుకుంది. ఈ సందర్భంగా టీవీవాళ్లు ఆమెతో ప్రత్యేక కార్యక్రమం అదే పరిచయం- హొగడ్త- "మీ రెలా ఇంతవారయ్యారు? మీకు ప్రేరణ ఎవరు?" అంటూ ఉక్కిరిబిక్కిరి చేసే ప్రసారం అన్నమాట. అడిగేవాళ్లు అడిగేస్తారే గానీ, జవాబుకి టైమివ్వరు. అయినా, కళ్యాణికీరోజుల్లో ఇలా అడిగేవాళ్లను చాలా చాకచక్యంగా నోరు మూయించి తన గురించి తాను చెప్పుకోవడం బాగా తెలిసిపోయింది. ఆమెకెన్నో సన్మానాలు జరిగాయి. ఆమె సంస్థలకి లక్షలకి లక్షల విరాళాలు వచ్చి పడుతున్నాయి. అయినా, 'నాకేదో తపన. ఇంకా చెయ్యాలి... ఇంకా చెయ్యాలి' అని అంటూంటుంది. అదో వూతపదం అయి కూర్చుంది ఆమె మాట్లాడేటప్పుడు.

"అమ్మీ వాళ్లంతా వచ్చేశారమ్మీ! మేం సర్దుకుంటూ ఉంటాం. మీ అమ్మగారిని సిద్ధం కమ్మని చెప్పు!" అన్నాడు కెమెరామాన్. తలూపి లోపలికి పరుగెత్తింది. రుక్మిణిలాంటిదే.. పద్దెనిమిదేళ్ల వయసు. కాస్త బక్కగా ఉన్నా, ముఖంలో తృప్తి ఉందామెలో. "లక్కీ విమెన్! చూడు, చక్కని పనిపిల్లలు దొరికారు! మనకి దొరికిచావరు!" అన్నాడు దర్శకత్వం వహించడానికి వచ్చిన పెద్దమనిషి. "సంఘసేవిక కదా? సహాయం కోరుతూ బోల్డుమంది వస్తూంటారేమోలే! అసలే కళ్యాణిగారి గుండె ఎదుటివారి కష్టాలు చూసి కరిగిపోతుంది అంటారు. ఆమె కన్నీళ్లు కారుస్తూ, వారికోసం తపించిపోతారని విన్నాను!" అంది ఇంటర్వ్యూ చేయడానికి వచ్చిన అమ్మాయి. ఇప్పుడామె స్థితి గాంధీగారి మూడుకోతుల కథలా ఉంది. ఆయనగారు 'చెడు చూడకు, వినకు, అనకు' అని చాలా సింపుల్‌గా చెప్పి చక్కాపోయాడు. అదెంత కష్టమో ఆయనగారికేం తెలుస్తుంది? అటూ ఇటూ గాలిలో వచ్చే వార్తల గురించి అడిగితే కష్టం. ఆవిడ ఎలాగూ సమాధానం చెప్పరు. కానీ, ఆమె ఏం చెప్పినా వినే స్థితి నాది!' మనసులోనే అనుకుంటూ కూర్చుంది మేడమ్ రాకకోసం అనూరాధ.

"ఏమిటి అనూరాధా, అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" నవ్వుతూ దర్శకుడుగారు అడిగారు.

"ఏం లేదు, సార్! కాస్త జంకు!" అంది నెమ్మదిగా.

"అరె నీకా? జంకా?! ఎలాంటివారినైనా తికమక పెట్టే రకం!"

"లేదు సార్, మరీ లోతుగా వెళ్లవద్దని పెక్సుగారు బయలుదేరేముందే చెప్పారు."

ఆమె మాట పూర్తి కాకుండానే ఇంకో పనిపిల్ల పరుగున వచ్చింది. "అమ్మగా రోసారి రమ్మంటున్నారండీ!" అంది భయంభయంగా.

"ఎందుకూ? కొంపతీసి కాన్సిల్ అనరు కదా!" పైకే అనేశాడు కెమెరామన్.

దర్శకుడు ఓ చిరునవ్వు నవ్వి, "అందుకై ఉండదులేవయ్యా! వెళ్లు!" అన్నాడు.

బితుకుబితుకుమంటూ కెమెరామన్ లోపలికి వెళ్లాడు.

"రండి, ఈ చీరల్లో ఏది కట్టుకుంటే బాగుంటుందో అడగాలని. తెలుపు రంగు టీవీకి బాగుండదంటారు కదా?" చిన్న నవ్వు నవ్వి ఆగింది కళ్యాణి.

'బ్రతుకుజీవుడా!' అనుకుని, "మీకు ఏది కట్టుకోవాలని ఉంటే అది కట్టుకోండి మేడమ్, ఇదేం మీకు కొత్త కాదు కదా!" అన్నాడామెకు వినీ వినిపించనంత నెమ్మదిగా.

"ఏం కాదు, చూసేవాళ్లకి ఇంపుగానూ, సింపుల్‌గానూ ఉండాలి కదా! చూడండి... ఇవి మా సేవాకేంద్రంలో మగ్గాలమీద వేసినవి... కాస్త మూరతక్కువ. ఇది కంచీ కాటన్. ఇది బెట్టినాడే!"

ఆమె మాటకి అడ్డు తగులుతూ, "మీ ఇష్టం... టైము అయిపోతోంది, త్వరగా రండి... ప్లీజ్!" అంటూ బోనులోంచి తప్పించుకుపోయిన ఎలుకలాగా పరుగుతీశాడు బయటకి.

"ఏం... ఏమైంది? ఏ తలనొప్పా?" భయంగా అడిగింది.

"ఏం లేదు, అనూరాధా! ఏ చీర బాగుంటుందని అడగడానికి పిలిచారంతే!" నవ్వబోయి ఆగిపోయాడు.

"ఏదో చెప్పేస్తే త్వరగా వచ్చేదిగా!" గుసగుసలాడాడు దర్శకుడు.

"అమ్మగారు ఎక్కడ కూర్చోవాలో కుర్చీ వేయండి సార్, వచ్చేస్తున్నారు!" అంది పనిపిల్ల. మాట చెప్పి లోపలికి పరుగుతీసింది.

'అబ్బ! నోటి మాటమీద నడిచే రకాలు!' అనుకుంది అనూరాధ. తన నాలుగేళ్ల కొడుకుని చూసుకుందుకు మనిషి ... అదీ కాస్త స్థిరంగా ఉండేది దొరక్క నానా అవస్థలూ పడిపోతున్న అనూరాధకి కాస్త జెలసీ కలిగింది... ముచ్చటైన, ముఖ్యంగా వాగని పిల్లలని చూస్తూంటే.

కెమెరామన్ కుర్చీ వేశాడు. ఫ్లాష్ వాళ్లకి, లైట్




# ఇది మీకు జీవితకాలపు బహుమానం!

## భారతదేశం ఈ ప్రపంచానికి ఓ ఆధ్యాత్మికదిక్సూచి

భౌతికంగా ఆర్థికంగా విదేశాలు అత్యున్నతస్థితిలో వుండొచ్చుగాక! కాని వారి ఆఖరి మజిలీ మన భారతావని!! ఇది నేటి వాస్తవం. వేదాలూ ఉపనిషత్తులూ ఉద్భవించిన భూమి ఇది. మనిషి గమ్యాన్నీ గమనాన్నీ నిర్దేశించే సూచికలు అవి. ఇవి కొందరికే పరిమితం కాదు. వాటిని అందరికీ అందించే సంకల్పంతో అక్షరవాచస్పతి డాక్టర్ దాశరథి రంగాచార్య తేటతెలుగులో నాలుగువేదాలనూ అందించి చరిత్ర సృష్టించారు. అదే వొరవడిలో ఇప్పుడు ఆంధ్రపాఠకుల కోసం ఆయన ఉపనిషత్తుల సారాంశాన్ని 'ఉపనిషత్ అమృతం' పేరిట ఆబాలగోపాలానికీ అర్థమయ్యే రీతిలో అందిస్తున్నారు. మీరు చదవండి, పదిమందికీ ఈ వార్త చెప్పి చదివించండి! ఓ మంచి పనికి మాటను అందించి మనవైన ఉపనిషత్తులలోని అమృతాన్ని మీరు గ్రోలి పదిమందికీ అందించండి. ఇది మీరు చేసే మానవ సేవ మాధవ సేవ...!

త్వరలోనే ప్రారంభం!

బోర్డు వాళ్లకీ ఖచ్చితంగా చెప్పాడు. "మీరు అటూ ఇటూ కదలండి... ప్లీజ్ ఆవిడని ఇటూ అటూ కదపకండి. మన ప్రాణాలు పోతాయి. ఓకే!" అంటూండగానే కళ్యాణి చేతులు జోడించి హాల్లోకి ప్రవేశిస్తూ ...

"నమస్కారం, క్షమించండి, ఆలస్యం అయింది. ఓ పిల్లకి కాస్త జ్వరం. పొద్దుటి నుంచీ దాన్ని చూసుకోవడంతో సరిపోయింది... వెంటనే ప్రారంభించేద్దాం!" అంటూ చూపెట్టిన కుర్చీలో కూర్చుంది.

చేతి సౌంజ్ఞ చూసి అనూరాధ అందుకుంది "నమస్కారం. ముందు అవార్డు వచ్చినందుకు అభినందనలు. ఇది స్త్రీలందరికీ గర్వకారణం..!"

కళ్యాణి బాగా తలవంచి చేతులు జోడించి మళ్లీ నమస్కరిస్తూ, "ఇది మీరంతా నాకిచ్చిన భాగ్యం. గుర్తింపు. దీన్లో నేను చేసిందేముంది?" అంది.

అనూరాధ మనస్సు ప్రశ్నలతో పేలడానికి సిద్ధంగా ఉన్న బాంబులా ఉంది. కానీ అవి అడిగే ప్రశ్నలు కావు! అంచేత, "మీ కృషి గురించి చెప్తారా?" మృదువుగా అడిగింది.

"చెప్పడానికేముంది అమ్మాయీ, చిన్నప్పటినుంచి నాకు కష్టపడేవారిపట్ల అభిమానం ఉండేది. స్కూల్లో తోటిపిల్లలకి నా అన్నం ఇచ్చేసి ఇంటి దగ్గర తిన్నానని అబద్ధాలు చెప్పేదాన్ని!" చిన్నగా నవ్వి, "అమ్మకి నా గుణం తెలుసు. రాగానే తినడానికి పెట్టేది!" అంది.


"ఇలా సంస్థ స్థాపించాలని, దాన్నో వటవృక్షం రీతిన విస్తరింపచేయాలని ఎలా తోచిందండీ? దీనికి ప్రోత్సాహం ఎలా లభించింది?" అమాయకంగా అడిగింది అనూరాధ.

"నేను, నా పిల్లలు ... అంతా ఒకే మనస్తత్వం గలవాళ్లం. నాలాగనే వారికీ సేవా కార్యక్రమాలలో విపరీతమైన అభిమానం. ఇక సంస్థ అంటారా? విత్తు నాటితేనే కదా మొక్క మొలిచేది?" కాస్త ఆగి, "ఆ విత్తనం రావిచెట్టుదైనా, మర్రిచెట్టుదైనా, మామిడి అయినా ఒకటే కదా! విత్తనం మొలవాలి ... అలాగే అనుకుని కాస్త దూరం అయినా తక్కువ అద్దెకి ఇల్లు తీసుకున్నాను. బోర్డు పెట్టాను. ఈ దేశంలో దీనులకేం కొదవ? కష్టజీవులకేం కొదవ? బోర్డు చూసి, పెట్టినరోజే నలుగురు వచ్చారు. 'ఇక్కడే పడివుంటాం. పనులు చేస్తాం. ఇంత తిండి, బట్ట, నిలువ నీడ కల్పించండమ్మా!' అంటూ కాళ్లమీద పడ్డారు. వారి ముఖాలు చూసి నా హృదయం పగిలింది!" కళ్యాణి కన్నీరు కార్చడం మొదలుపెట్టింది.

కెమెరా ఆఫ్ చేయలేదు. లైట్లూ ఆర్పలేదు. 'కానిస్తూడండీ...!' అని కళ్లతోనే చెప్పాడు దర్శకులుంగారు. కట్‌చేసి కళ్లు తుడుచుకోండి అంటే అదో టైమ్ వేస్టనిపించిందాయనకి.

"అలా ప్రారంభమైంది. అడితెల వాళ్లు కర్రలు, పాత్రలవాళ్లు గిన్నెలు, బియ్యం వ్యాపారులు బియ్యం బస్తా వడేసి వారి సేవా మనస్తత్వాలను చాటుకుంటూ నాకు అండగా నిలబడ్డారమ్మా! ఇట్టే కాలచక్రం తిరిగిపోయింది. పాతికేళ్లు ... పాతికేళ్లపాటు నా శక్తినీ కాలాన్నీ ఈ సంస్థలకి ధారపోశాను... పెంచి పెద్దచేశానన్న తృప్తి మిగిలింది నాకు!" నిట్టూర్చారు.

"మీ పిల్లలు...?" ప్రశ్న ముగియకుండానే కళ్యాణి ఉత్సాహంగా అందుకుని, "వాళ్లంతా ఈ సంస్థలకే అంకితం అయ్యారమ్మాయీ! ఇద్దరు కొడుకులూ, ఇద్దరు కూతుళ్లూ, వారి భార్యలూ, వీరి భర్తలూ అంతా సంఘసేవలోనే ఇమిడిపోయి జీవితాలు ధారపోస్తున్నారు. వీళ్లే కాదమ్మా, చాలామంది అటువైపు చుట్టాలూ, ఇటువైపు చుట్టాలూ వివిధ శాఖలపై ఆధిపత్యం వహిస్తూ చక్కగా పనులు చేయిస్తున్నారు. ఇక్కడ తయారయ్యే కారంపొడుం దగ్గరనుంచి కార్పెట్లదాకా దేశంలోనే కాదు విదేశాలలో కూడా చాలా ప్రాచుర్యం పొందుతున్నాయి. అనాథ స్త్రీలూ, బాలలూ చేస్తున్నారన్న అభిమానంతో దేశ విదేశ దాతలు డబ్బు గుమ్మరిస్తున్నారు... అందుకే ఏ శాఖకాశాఖకు స్వంత ఇల్లు ఏర్పాటు చేయగలిగాను. వాటికై ధనం ఇచ్చిన దాతల పేర్లే వాటికి పెట్టి నా కృతజ్ఞత తెలుపుకున్నాను. చూస్తారా?" ఆగి, దర్శకునివైపు చూసింది కళ్యాణి.




ఆపంకడన్నట్లు సౌంజ్ఞ చేయడంతో క్షణం పాటు తడబడి, తేరుకుని..

"సారీ, నా సంస్థలు నాకు పిల్లలకంటే ఎక్కువ. అవి అందరూ చూడాలని నేను తహతహలాడిపోతూంటాను. ఇంకా ఇంకా విస్తరించిపోతూండటం చూస్తే భయం కూడా వేస్తూంటుంది నాకు!" ఆగారామె.

"విస్తరణ అంటే ఇంకెంతోమందికి నీడనివ్వడమే కదా మేడమ్! భయం దేనికి?"

కాస్త నవ్వి, "ఏం లేదమ్మా, సేవాభావంతో సేవచేయడానికే అంకితం అయిపోయినవాళ్లు రాను రానూ కనుమరుగైపోతున్నారు. చిన్నచిన్న ఊళ్లకి వెళ్లి, అక్కడ సేవాకేంద్రాలు పెట్టుకుంటున్నారు!" అన్నది నెమ్మదిగా.

"నిజంగా మీరు నాటిన మర్రిచెట్టు చాలా వూడలు వేయడం మీకు సంతోషంగా లేదా?" కుతూహలంగా అడిగింది అనూరాధ.

"ఉంది. కానీ ఊడలెక్కువైనకొద్దీ సేవలు పల్చబడిపోతాయేమోననే నా భయం!"

"అంటే... మంది ఎక్కువ అయితే మజ్జిగ పల్చబడినట్లు అనా మీ భావన?" అనూరాధ కాస్త చిలిపిగా అడిగింది.

"పల్చని మజ్జిగైనా దాహం తీరుస్తుంటే నేను ఆనందిస్తాను. అలా జరగడంలేదేమో ననే నా బెంగ."

"అంటే... కాస్త వివరిస్తారా?"

"ఒక తల ఉండి, శాఖోపశాఖలు ఉండాలి. వాటికి ఆధారం ఆ తల కావాలి. అంటే, అప్పుడే వస్తున్న ఫండ్స్‌మీద అదుపు ఉంటుంది. సరిగ్గా ఖర్చుపెట్టడం జరుగుతుంది. సేవలు సవ్యంగా అందించగలుగుతాం. అదీ నా అభిప్రాయం!" ఖచ్చితంగా చెప్పారు కళ్యాణి.

"వికేంద్రీకరణలో చాలా సౌలభ్యం ఉందంటారు కదా? ఆ వాదనతో మీరు ఏకీభవించరన్నమాట. అంతేనా?"

కాస్త తడబడి, "అలా అని కాదు. ఎటువంటి వ్యక్తుల చేతుల్లోకి వెడుతుంది... సేవా కర్యక్రమం అన్నది కూడా ముఖ్యం కదా?"

"ఎక్కడో ఒకచోట ప్రారంభం జరగాలి కదా?" అనూరాధ ఎదురు ప్రశ్న వేసింది.

కళ్యాణి ముఖం కాస్త సీరియస్‌గా అవడం, ముగించమన్నట్టు దర్శకుడు చేయి ఊపడం ఒకేసారి జరిగాయి.

"సేవకు అంకితం అయిన మీకు వృత్తి - సంఘసేవ ... కాదు కాదు ... సారీ! వృత్తీ ప్రవృత్తీ కూడా సంఘసేవే అవడం నిజంగా మీ అదృష్టం! ఇలాంటి అవకాశం మీకే కలగడం కూడా కాకతాళీయం కాదు! మీవంటి మహిళలు ఉండటం వల్లే కదండీ కష్టాల్లో ఉన్న స్త్రీల కన్నీళ్లు తుడవబడుతున్నాయి. వారి కృతజ్ఞతలే మీకు పెద్ద సన్మానం. మీ మనసు విప్పి మాట్లాడినందుకు మా కృతజ్ఞత. నమస్కారం!" అంది గంభీరంగా అనూరాధ ఇంటర్వ్యూ ముగించేస్తూ.


లైట్లు ఆరాయి. కెమెరా కన్ను మూసింది. దర్శకుడు "త్వరగా కొట్టు కట్టేయండి. ఇంకోటుంది!" అంటూ ఓ దమ్ములాగడానికి బయటకి నడిచారు.

అంతా పాకప్ హడావుడిలో ఉండగా, "నీదేవూరు?" అడిగింది కళ్యాణి అనూరాధకేసి అనుమానంగా చూస్తూ.

"అయ్యో ... నేనండీ, లక్ష్మీదేవిగారి కూతుర్ని. నన్ను చిన్నప్పుడు చూసి ఉంటారు!"

'లక్ష్మీదేవి?' కాస్త ఆలోచనలో పడినట్టు మాట్లాడలేదు కళ్యాణి.

"అదేనండీ... మీరు ఓ సారి మా ఇంటికి వచ్చారు. అది పాతికేళ్ల క్రిందట... ఆ రోజులు వేరు. మీకప్పుడు ... నిలువ నీడ లేదంటూ




వచ్చారు. అమ్మ మిమ్మల్ని 'మండలి'కి ఉత్తరం ఇచ్చి పంపారు గుర్తుందా?" కసిగా అడిగింది అనూరాధ.

"ఓ... జ్ఞాపకం వచ్చింది. ఆమె చూపిన బాటే!" వినీ వినపడనంత నెమ్మదిగా అంటున్న కళ్యాణిని చూసి అనూరాధకి జాలివేసింది. గతం మరచిపోవడానికి ఇంత ముసుగు!

"నేను వస్తానండీ, పాప దగ్గర అమ్మిని ఉంచి వచ్చా!" అంటూ లేచింది అనూరాధ.

"అమ్మ ఇక్కడే ఉన్నారా? ఈ కార్యక్రమం చూస్తారా" నూతిలోంచి వస్తున్న కంఠంతో అడిగారు.

"ఆ... మీరు కమలగారనీ.... చాలా చెప్పింది. సారీ, సంఘసేవ అంటె- దాన్ని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చేసిపారేశారు. మీవాళ్లంతా జీతాలకేం చేస్తారు; స్వంత బతుక్కి, ఏం చేస్తారు? సకుటుంబంగా 'సేవా కార్యక్రమంలో మునిగి తేలడం అంటే ఇది కాదుగా.' దీన్ని 'వృత్తి' అంటారు. ఆ సంగతి మరుగున పడేశారు మీరు!"

గిరుక్కున తిరిగి మిగిలినవారితో కలిసి నడిచింది అనూరాధ.

"రుక్మిణీ! ఎక్కడ చచ్చావే! కాస్త మంచినీళ్లు తే!" అరుస్తూ కుర్చీలో జేరబడిపోయింది కళ్యాణి.

"ఏమైందమ్మా? అలా ఉన్నారేం? అలసిపోయారా? పళ్లరసం తెస్తా ఒక్క క్షణంలో!" అంటూ కదలబోతున్న దాన్ని ఆపి, "ముందు నాకు స్నానం చేయించే ప్రయత్నం చెయ్యి. ఈ పాడుచీర విప్పేయ్యాలి!" విసుగ్గా పడకగదికేసి నడిచి మంచంమీద వాలిపోయింది కళ్యాణి.

ఆమె కళ్లు తెరిచినా, మూసినా లక్ష్మీదేవిగారి ఆదరణ, అభిమానం కనిపించాయి, వినిపించాయి.

"ఇట్టే చెట్టెక్కేసిన నేను కింద పడను కద?" అనుకుని గట్టిగా కళ్లు మూసుకుంది కళ్యాణి.

"ఎంత మాటండీ! పొట్టపోసుకుందుకే సంఘసేవ స్వీకరించాం అంటుందా!" నిట్టూర్చింది. కానీ అనూరాధ మాటలు మటుకు ములుకుల్లాగా గుండెలో పొడుస్తున్నాయి ఆమెని. ■

## ఆంధ్రప్రభ పాఠకులకు మాత్రమే ఈ అపూర్వకానుక!

వేదం భారతజాతి జీవననాదం. వందేళ్లుగా మరేభాషలోనూ ఎవరూ చేయని అద్భుతాన్ని డాక్టర్ దాశరథి రంగాచార్య తెలుగులో చేశారు. ఋగ్వేద యజుర్వేద సామవేద అధర్వణవేదాలను చిక్కటి సంస్కృతం నుంచి (9 సంపుటాలు) చక్కటి తెలుగులోనికి అనువదించారు. వేదాలను మనదైన భాషలో హాయిగా చదువుకునే అవకాశం ఇది! ఎమెస్కో ఆర్షభారతి వీటిని రు.2,950/లకు విక్రయిస్తోంది. ఆంధ్రప్రభ పాఠకులకు మాత్రం రు.2000/లకే అందిస్తోంది. ఈ కింది కూపన్ నింపి నగదును డీడీరూపంలో **EMESCO ARSHABHARATHI , VIJAYAWADA** పేరిట తీసి ఎమెస్కో ఆర్షభారతి, ఏలూరురోడ్, విజయవాడ-చిరునామాకు పంపితే చాలు. పోస్టేజ్ ఛార్జీలు కూడా భరిస్తూ రు.2000/లకే మీకు వేదాలు పంపుతారు. ఈ కూపన్‌ను ఎమెస్కో బుక్‌షాప్‌లో ఇచ్చికూడా వీటిని పొందవచ్చు.

మహత్తరమైన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మీ ఇళ్లను మంగళకర వేదపఠనంతో శుభకరం చేసుకోండి!

ఎమెస్కో ఆర్షభారతి-ఆంధ్రప్రభ

పేరు: ----------------------------------------

వృత్తి: ----------------------------------------

చిరునామా: ----------------------------------------

----------------------------------------

డీడీ నంబరు: ----------------------------------------